ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 2 జనవరి 2025

గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో ఇప్పటి వరకు నిర్మాణాల్లో మదనపల్లె ప్రథమస్థానంలో ఉండగా, రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పథకం ప్రారంభానికి ముందే ఇప్పటికే ప్రోగ్రెస్‌లో ఉన్న పథకాన్ని పూర్తి చేయడానికి కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందికి రోజువారీ, వారం, పదిహేను రోజులతో పాటు నెలరోజులకు ఎన్ని గృహాలు పూర్తి చేయాలో లక్ష్యాలు విధిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు ఆయా స్టేజీల్లోని గృహాల ప్రగతిని పరిశీలిస్తే జిల్లాలో మదనపల్లె మొదటి స్థానాన్ని దక్కించుకుంది. అలాగే పీఎంఏవై రెండో విడత నిర్మాణాలకు అటు లబ్ధిదారులను ఎంపిక చేస్తూనే ప్రస్తుతం ప్రోగ్రెస్‌లో ఉన్న జగనన్న గృహ నిర్మాణ పథకాన్ని పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

గృహ నిర్మాణాల్లో..

మదనపల్లె ప్రథమం



- రాష్ట్రంలో మూడోస్థానం
- పీఎంఏవై రెండో విడత మంజూరు
- లబ్ధిదారుల ఎంపికలో అధికారులు

మదనపల్లె, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్లలో 30 మండలాలు, మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీ ఉంది. ఇందులో గత ప్రభుత్వం అంచెలంచెలుగా మొత్తం 78,221 గృహాలు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు 34,718 గృహాలు పూర్తి కాగా బీఎల్ స్థాయిలో 19,001, లింటల్ స్థాయిలో 997, ఆర్‌ఎల్ స్టేజీలో 5,449, మోల్డింగ్ పూర్తయినవి 752 గృహాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.




వలసపల్లె సమీపంలోని జగనన్న లేఅవుట్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) రెండో విడత గృహాలను మంజూరు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రాష్ట్రం, జిల్లాలు, పట్టణాల వారీగా గృహాల సంఖ్యను ప్రకటించింది. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాలకు 6.12 లక్షలు మంజూరు చేయగా, ఏపీకి 50 వేలు కేటాయించింది. ఇందులో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మున్సిపాలిటీకి 460 గృహాలు, రాయచోటికి 310, రాజంపేటకు 160, బి.కొత్తకోట నగర పంచాయతీకి 75 ఇళ్లు కేటాయించారు. వీటిని 2029 నాటికి పూర్తి చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. నాటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం నుంచి రూపాయి ఖర్చు లేకుండా కేంద్రం ఇచ్చే పథకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు కేంద్రం ఇచ్చిన యూనిట్ విలువ రూ.1.80 లక్షలతోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని అటు లబ్ధిదారులతో పాటు ఇటు అధికారులపై ఒత్తిడి చేసింది. ఆ యూనిట్ విలువ కొన్ని చోట్ల పునాది నిర్మాణానికి కూడా సరిపోలేదు. అందుకే క్షేత్రస్థాయిలో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకున్న కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ.1.50 లక్షలకు రాష్ట్రం రూ.లక్ష ఇస్తోంది. అలాగే ఎస్సీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించారు. అలాగే గతంలో వైసీపీ ప్రభుత్వం లేఅవుట్లలో పట్టణాల్లో పేదలకు ఒక సెంటు, గ్రామాల్లో రెండుసెంట్లు స్థలం ఇచ్చింది. ఇది ఎక్కడికీ చాలకపోవడంతో పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ప్రభుత్వం స్థలాలు కేటాయించనుంది.

పట్టణ వాసులకే ప్రథమ ప్రాధాన్యం

గత వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు, ఇటు అధికారులకు ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభు త్వం పట్టణవాసులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. అది కూడా సొంత స్థలం ఉన్న వారినే ఎంపిక చేస్తోంది. డీకేటీ పట్టా లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంటుపై ఇల్లు మంజూరు చేస్తున్నారు. ఇందులో భాగంగా గృహనిర్మాణశాఖ, సచివాలయ సిబ్బంది ఇంటింటా డిమాండ్ సర్వే చేస్తున్నారు. పట్టణంలో ఇప్పటికే ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఏడువేల మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందులో అర్హతను వడపోత చేపట్టి మున్సిపాలిటీకి కేటాయించిన 460 గృహాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పక్కా ఇంటి కోసం లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేయనున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్ విలువపై స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు.



పోతబోలు లేఅవుట్‌లో నిర్మించిన గృహాలు

నియోజకవర్గం వారీగా...

- మదనపల్లెకు 15,401 గృహాలు మంజూరు కాగా 7,320 గృహాలు పూర్తి కాగా, బీఎల్ స్థాయిలో 4,472, లింటల్ స్థాయిలో 225, ఆర్‌ఎల్ స్థాయిలో 1,080, మోల్డింగ్ పూర్తయినవి 273 గృహాలు ఉన్నాయి.
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో 12,947 గృహాలు మంజూరు కాగా, 6,084 గృహాలు పూర్తి కాగా, బీఎల్ స్థాయిలో 1,828, లింటల్ స్థాయిలో 253, ఆర్‌ఎల్ స్థాయిలో 1,072, మోల్డింగ్ పూర్తయినవి 382 గృహాలు ఉన్నాయి.
- పీలేరులో 12,101 గృహాలు మంజూరు కాగా అందులో 6,328 గృహాలు పూర్తయ్యాయి. బీఎల్ స్థాయిలో 3,229 గృహాలు, లింటల్ స్థాయిలో 124, ఆర్‌ఎల్ స్థాయిలో 1025, మోల్డింగ్ పూర్తయినవి 311 గృహాలు ఉన్నాయి.
- రాయచోటి నియోజకవర్గంలో 20,043 గృహాలు మంజూరు కాగా, 8,021 గృహాలు పూర్తయ్యాయి. బీఎల్ స్థాయిలో 6,013 గృహాలు, లింటల్ స్థాయిలో 214, ఆర్ ఎల్ స్థాయిలో 1,097, మోల్డింగ్ పూర్తయినవి 758 గృహాలు ఉన్నాయి.
- రాజంపేటలో 11,206 గృహాలు మంజూరు కాగా, అందులో 4,073 ఇళ్లు పూర్తయ్యాయి. అలాగే బీఎల్ స్థాయిలో 2,746 గృహాలు, లింటల్ స్థాయిలో 54, ఆర్‌ఎల్ స్థాయిలో 695, మోల్డింగ్ పూర్తయినవి 523 గృహాలు ఉన్నాయి.
- రైల్వేకోడూరు నియోజకవర్గంలో 6,523 గృహాలు మంజూరు కాగా, 2,892 గృహాలు పూర్తి చేశారు. బీఎల్ స్థాయిలో 713 గృహాలు, లింటల్ స్థాయిలో 127, ఆర్‌ఎల్ స్థాయిలో 480, మోల్డింగ్ పూర్తయినవి 116 గృహాలు ఉన్నాయి.

అర్హులందరికీ పక్కాగృహం..



గతంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇబ్బడి ముబ్బడిగా కాకుండా అసలైన, అవసరమైన వారికి మొదటి ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే సొంత స్థలం ఉన్న వారిని ఎంపిక చేస్తున్నాం. అయిదేళ్లలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. గత ప్రభుత్వంలో మంజూరు చేసి ప్రోగ్రెస్‌లో ఉన్న పథకాన్ని పూర్తచేయిస్తూనే, మరోపక్క కొత్త స్కీంను ముందుకు నడిపించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ నుంచి పీఎంఏవై 2.0 గృహ నిర్మాణాలు మొదలు కానున్నాయి.

- కె.రమేష్‌రెడ్డి, హౌసింగ్ డీఈ, మదనపల్లె

ఇంటర్ విద్యార్థులకు రేపటి నుంచి మధ్యాహ్న భోజనం

కలికిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రమే ఉండే మధ్యాహ్న భోజన పథకాన్ని ఈనెల 3వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా వర్తింపచేయనున్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనాన్ని అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 29,961 మంది ఇంటర్ విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. ఇందులో మొదటి ఏడాది విద్యార్థులు 15,230 కాగా సీనియర్ ఇంటర్ విద్యార్థులు 14,731 మంది ఉన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసినా గత వైసీపీ ప్రభుత్వం దానిని పాఠశాలలకు మాత్రమే పరిమితం చేసింది. కాగా ఈనెల 3వ తేదీ జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. వాస్తవానికి జనవరి 2 నుంచే అమల్లోకి రావలసి ఉన్నా దానిని మరుసటి రోజుకు వాయిదా వేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా సంతాప దినాలు అమల్లో ఉండటంతో శుక్రవారం దీనిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఆయా ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రంలోని ఒక జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థుల పథకాన్ని ప్రారంభించనున్నారు. పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఒకే రకమైన మెనూ అమలు చేయనున్నారు.





రాజంపేటలో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, చిత్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు



రాజంపేటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం, చిత్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు

జన జాతరను తలపించిన నగరిపల్లె

- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి ఇంటి వద్ద కిక్కిరిసిన టీడీపీ శ్రేణులు


కలికిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం నగరిపల్లె జన జాతరతో కిక్కిరిసింది. ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలపడానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వచ్చిన టీడీపీ శ్రేణులు బారులు తీరారు. కేవీపల్లె మండలం నుంచి తెచ్చిన 200 కిలోల భారీ కేకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డితో పార్టీ నాయకుల సమక్షంలో కేకు కట్ చేసి పలువురి తినిపించారు. లెక్కకు మించి వాహనాలు రావడంతో నగరిపల్లెకు వెళ్లే దారులు మూసుకుపోయాయి. చివరికి గ్రామ శివార్లలో ఉన్న జాతీయ రహదారి మీద వాహనాలను పార్కింగ్ చేసి నడిచి రావలసి వచ్చింది.



200 కిలోల భారీ కేకు కట్ చేస్తున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

చిట్టి చేతులు లేక కొండంత కష్టం

- కృత్రిమ చేతులతో కాలయాపన
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ ఆదుకోవాలని కోరుతున్న కుటుంబం



రెండు చేతులు లేకపోవడంతో కాలితో రాస్తున్న విద్యార్థి సులేమాన్

సుండుపల్లె, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులో జరిగిన ప్రమాదం ఆ కుటుంబానికి తీరని కష్టాన్ని మిగిల్చింది. ఆడుతూ పాడుతూ అందరిలో ఒక్కడై ఉండాల్సిన ఓ విద్యార్థి అష్టకష్టాలు పడుతున్నాడు. విద్యుత్ తీగల రూపంలో వచ్చిన ప్రమాదం ఆ విద్యార్థి జీవితానికి శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే... సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బెస్తపల్లికు చెందిన షేక్ సులేమాన్ (14) అనే విద్యార్థి 2022 మే నెలలో విద్యుత్ తీగలు తగిలి చావు అంచుల వరకు వెళ్లాడు. రెండు చేతులు తీసేస్తేనే బతుకుతాడని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు, అవ్వాతాత సులేమాన్‌ను ఎలాగైనా బతికించుకోవాలని చేతులు తీసేసేదానికి ఒప్పుకున్నారు.



తన బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలని వేడుకుంటున్న తల్లి మస్తానీ

అయితే ఆ చిన్నోడి కష్టం చూడలేక అష్టకష్టాలు పడుతున్నారు. తల్లి, అవ్వ రెండు చేతులై సేవలు చేస్తున్నారు. ఈ విద్యార్థి గుట్టకిందరాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వైద్యం కోసం సుమారు రూ.10 లక్షలు అప్పు కావడంతో తండ్రి షేక్ మహబూబ్‌బాషా కుటుంబ పోషణ, చేసిన అప్పులు తీర్చేందుకు కువైట్‌కు వెళ్లాడు.

రెండు చేతులు లేకపోయినా..

షేక్ సులేమాన్ రెండు చేతులు తీసేసినా కూడా పట్టువీడని విక్రమార్కుడిలా విద్యను అభ్యసిస్తున్నాడు. చిన్న వయస్సులోనే కొండంత బాధను భరిస్తూ కాలితో రాస్తూ చదువుకుంటున్నాడు. బెస్తపల్లి నుంచి సుమారు 5కి.మీ. ప్రయాణం చేసి గుట్టకిందరాచపల్లెలోని పాఠశాలకు వెళుతున్నాడు. పేదరికం కారణంగా తల్లిదండ్రులు ప్రైవేటు బడుల్లో చదివించలేక రోజు ఆటోలో పాఠశాలకు పంపిస్తున్నారు. చదువును వదులుకోనని 9వ తరగతి విద్యార్థి మాట్లాడుతున్న మాటలు విన్న వారికి కన్నీటిని తెప్పిస్తున్నాయి.


ఆదుకోండి సారూ...

గత ఏడాది జనవరి 1వ తేదీ అప్పటి అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా ఆ విద్యార్థికి కృత్రిమ చేతులను అందజేశారు. ఆ చేతులతో నీరు తాగడం, ఆటో ఎక్కడం, పాఠశాలకు వెళ్లేందుకు బ్యాగులు ఎత్తుకోవడం వంటి పనులు చేస్తున్నాడు. కలెక్టర్ చేసిన సాయం ఆ విద్యార్థికి కాస్త ఉపయోగకరంగా మారింది. అయితే తినడం, కాలకృత్యాలు చేయడం వంటి పనులు కూడా చేసుకోలేక ఆ విద్యార్థి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబీకులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు తమ కుటుంబానికి అండగా నిలవాలని ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. మెరుగైన వైద్యం చేయించి మా బిడ్డ జీవితంలో వెలుగులు నింపాలని, ఆ విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని దండం పెట్టి వేడుకుంటున్నారు.

ముంపు పంచాయతీల పునర్విభజన ఎప్పుడో..

- ఎన్నికలను బాయ్‌కాట్ చేసిన దత్తాపురం వాసులు
- అయినా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

7



హా..హా..హార్సిలీహిల్స్

- కొండంత సంబరం
- వేలాదిగా తరలివచ్చిన సందర్శకులతో హిల్స్ కిటకిట
- పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిన నూతన సంవత్సర వేడుకలు
- ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపిన యువత



కొత్త వ్యూపాయింట్ నుంచి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



ఫారెస్ట్ క్యాంపస్‌లో హిల్స్ ఐకాన్ వద్ద ఫొటోషూట్

బి.కొత్తకోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఊటీ హార్సిలీహిల్స్ నూతన సంవత్సర వేడుకలకు ప్రధాన వేదికైంది. జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు కర్నాటక నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు హిల్స్‌ను సందర్శించి సేద తీరారు. మంగళవారం అర్ధరాత్రి వరకు కొండపైన యువకుల కేరింతలతో నూతన ఆంగ్ల సంవత్సరాన్ని స్వాగతం పలికారు. ఆడుతూ పాడుతూ ప్రకృతి అందాలను, అతిశీతల గాలులను, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. హిల్స్‌పైనున్న పాత, కొత్త వ్యూపాయింట్లు, కొండ చుట్టుపక్కల ఉన్న కోనప్రాంతాల వద్దకు వెళ్లి 4312 అడుగుల కిందనున్న పంటపొలాలు, పల్లెలను చూస్తూ పులకించారు. సెల్ఫీలు, వీడియోలు, ఫొటోలు తీసుకుంటూ తమ సహచరులకు వీడియో కాల్‌లలో హార్సిలీహిల్స్ అందాలను చూపుతూ ఉల్లాసంగా గడిపారు. గాలిబండ, టూరిజం రెస్టారెంట్, స్విమ్మింగ్‌పూల్, ఫారెస్ట్ క్యాంపస్‌లోని జూపార్కు, మొసళ్లపార్కు, అందాలపక్షులను వీక్షించడంతో పాటు మానససరోవరంలో బోటింగ్ చేస్తూ తియ్యని అనుభూతిని ఆస్వాదించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండపైకి ఎక్కే వాహనాలు ఎక్కుతుంటే దిగే వాహనాలు దిగుతూనే ఉన్నాయి. హిల్స్‌పైకి 300కు పైగా కార్లు, జీపులు కింది భాగంలోకి సుమారు 400 ద్విచక్రవిహనాలు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

గట్టి బందోబస్తుతో అంతా ప్రశాంతం..


జనవరి ఫస్ట్‌కు వేలాదిగా సందర్శకులు తరలిరావడంతో పోలీసులు కఠినమైన ఆంక్షలు విధించారు. కొండ మీదికి ద్విచక్ర వాహనాలను అనుమతించకపోవడంతో యువకుల ర్యాష్ డ్రైవింగ్‌కు అవకాశం లేకుండాపోయింది. ఘాట్‌రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ ద్విచక్ర వాహనాలు ఆపి అల్లర్లు చేయడం, ప్రేమ జంటల విహారం, రోడ్లలో నృత్యాలు లేకుండా పోయాయి. సుమారు 50 మంది సిబ్బందిని వివిధ ప్రాతాలలో మోహరించి సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు బందోబస్తును పర్యవేక్షించడంతో అంతా ప్రశాంతంగా ముగిసింది.

పర్యాటకులకు సత్వర సేవలు..

హార్సిలీహిల్స్‌కు తరలివచ్చిన పర్యాటకులకు ఆర్టీసీ రవాణాపరంగా సత్వర సేవలు అందించింది. కొండ కింద ముఖద్వారంలో దిగిన వారిని దిగినట్టే బస్సులలో ఎక్కించి కొండమీదికి చేర్చారు. అదేవిధంగా పర్యటన ముగించుకొని దిగేవారిని తక్షణం బస్సులను అందుబాటులో ఉంచి కిందకు దించారు. 26 బస్సులను ఏర్పాటు చేయడంతో ఎటువంటి రద్దీ లేకుండా రాకపోకలు జరిగాయి.



గాలిబండ మీద తిరుగుతూ సందడి చేస్తున్న జనం



మానస సరోవరంలో బోటు షికారు

వ్యాపారులు బిజీ..బిజీ

హార్సిలీహిల్స్‌పై ఉన్న ఏపీ టూరిజం రెస్టారెంటు, ప్రైవేటు రెస్టారెంట్లతో పాటు తాత్కాలికంగా బిర్యానీ బండ్లు, ఇతర తిను బండారాలు పెట్టిన చిరు వ్యాపారులకు వ్యాపారాలు బాగా జరిగాయి. సాయంత్రం వరకు వ్యాపారులు బిజీబిజీగా గడిపారు. కుటుంబ సమేతంగా హిల్స్‌కు వచ్చిన వారు చల్లని ప్రదేశాన్ని ఎంచుకొని గుంపులుగా కూర్చొని విందు భోజనాన్ని ఆరగించారు. యవకులు, యువజంటలు. పిల్లలతో సహా వచ్చిన పర్యాటకులతో హార్సిలీహిల్స్‌లో నూతన సంవత్సర వేడుక సంబరంగా, సంతోషంగా ముగిసింది.

ముంపు పంచాయతీల పునర్విభజన ఎప్పుడో...

- పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలను బాయ్‌కాట్ చేసిన దత్తాపురం వాసులు
- అయినా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

కొండాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన పంచాయతీల పునర్విభజన కాకపోవడంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. గండికోట ప్రాజెక్టు కింద 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాలకు కొండాపురం మండలంతో పాటు ఇతర మండలాల్లోనూ పునరావాసం కల్పించారు. పునరావాసం కింద కొన్ని పంచాయతీలను యధాతదంగా ఉంచారు. అయితే మరికొన్ని పంచాయతీలను ముంపునకు గురికాని పంచాయతీల్లో కలిపారు. పునరావస కేంద్రం ఉన్న రెవెన్యూ భూమిలో పంచాయతీలను కలపారు. అయితే ముంపునకు గురికాక ముందు ఉన్న పంచాయతీలను యధాతదంగా ఉంచాలని ఆయా పంచాయతీల నిర్వాసితులు కోరుతున్నారు.

గ్రామసభలు నిర్వహించినా...

పంచాయతీలను వీలీనం చేసేటప్పుడు ప్రజల అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉంటుంది. అభిప్రాయాలను తీసుకున్నా అందుకు విరుద్ధంగా తమ పంచాయతీలను వీలీనం చేశారంటూ ముంపు వాసులు మండిపడుతున్నారు. గతంలో మండలంలోనే పెద్ద పంచాయతీగా ఉన్న దత్తాపురం పంచాయతీని, అలాగే బుక్కపట్నం, బొమ్మేపల్లె పంచాయతీలను కె.సుగుమంచిపల్లె పంచాయతీలో కలిపారు. అలాగే చౌటిపల్లె పంచాయతీని ఓబన్నపేట పంచాయతీలో కలిపారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో దత్తాపురం వాసులు పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరించారు. తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పంచాయతీలను వీలీనం చేయడంపై వారు మండిపడుతున్నారు.



పాత పంచాయతీలను కొనసాగించాలి

గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురికాక ముందు మండలంలో 28 పంచాయతీలు ఉండేవి. ప్రస్తుతం వీలినం చేయడంతో 24 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. 28 పంచాయతీల్లోని నాలుగు పంచాయతీలు చౌటిపల్లె, దత్తాపురం, బుక్కపట్నం, కె.బొమ్మేపల్లెలు వీలీనం కావడంతో ప్రస్తుతం 24 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. దీంతో పంచాయతీలకు వచ్చే నిధులను కోల్పోవడంతో పాటు, ఏళ్ల కాలం నుంచి తమ పంచాయతీలతో ఉన్న సెంటిమెంటును కోల్పోతున్నామని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

ఈ మధ్యన మంత్రి నిమ్మలరామానాయుడు గండికోట ప్రాజెక్టుకు వచ్చినప్పుడు ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. దీంతో కూటమి ప్రభుత్వంపైనే ముంపువాసులు ఆశలు పెట్టుకున్నారు.



గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలి

పంచాయతీల పునర్విభజనకు సంబంధించి నిర్వాసితులు కోర్టులో కేసు వేయగా ప్రభుత్వంతో పరిష్కరించుకోవాలని కోర్టు తెలిపింది. ప్రభుత్వంలో ఉన్న పెద్దలతో పాటు కలెక్టరు, ఇతర అధికారులతో కలిసి గ్రామసభల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది.

-నాగప్రసాద్, ఎంపీడీవో, కొండాపురం



మా పంచాయతీలను గతంలో మాదిరిగానే ఉంచాలి

గండికోట ప్రాజెక్టు కింద భూములు, ఇళ్లు కోల్పోయాం. ముంపున కు గురైన మా పంచాయతీకి సంబంధించిన ప్రజలు పునరావాసం కింద కె.సుగుమంచిపల్లె రెవెన్యూ భూమిలో ఇళ్లు నిర్మించుకుంటే ఆ పంచాయతీలో కలిపారు. మా ఊరు-మాది అనే భావన ఉంటుంది కదా. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మా పంచాయతీని పునర్విభజన చేసి గతంలో లాగానే ఉంచాలి.

-మేకల బాలనాగిరెడ్డి, దత్తాపురం

దానం చేయడంలోనే ఆత్మసంతృప్తి

- ప్రముఖ జ్యోతిష్యశాస్త్ర నిపుణుడు ముద్దల సురేష్‌బాబు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణుడు సురేష్‌బాబు

కడప కల్చరల్ జనవరి 1, (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎందరో నిరుపేదలున్నారని, అలాంటి వారికి పర్వదినాల్లో అయినా కాసింత మానవత్వంతో వున్న దానిలో కొంత భాగం దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణుడు ముద్దల సురేష్‌బాబు కోరారు. నూతన సంవత్సరం, ఆయన తనయుడు శశాంక్ దేవేద్ జన్మదినం పురస్కరించుకుని బుధవారం ఎన్‌జీఓ కాలనీలోని ఆయన స్వగృహంలో కన్నుల పండువగా నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. తొలుత కేక్ కట్‌చేసి పేద మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ సంపాదనే ధ్యేయంగా కొందరు జీవిస్తుంటారని, ఎంత సంపాదించినా చివరకు మనతో పాటు ఏమీ తీసుకుపోలేమనే సంగతి గుర్తెరగాలన్నారు. మనకున్న కొంతలో కొంత పేదలకు పంచినపుడే నిజమైన ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మనోహర్, స్తోత్రరాజ్, జాన్, సుజాత, నిర్మల, బుజ్జి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వైసీపీ నేతల దాడి

- పోలీసులకు ఫిర్యాదు



గాయపడిన మహిళలు రమీజాబీ, రహీమాబీ

పెద్దతిప్పసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఇద్దరు మహిళలపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మహిళల సమాచారం మేరకు... మండలంలోని కందుకూరు గ్రామంలోని గుగ్గిళ్ల వీధికి చెందిన రమీజాబీ, రహీమాబీ అనే ఇద్దరు మహిళలు టీడీపీకి సానుభూతిపరులుగా ఉన్నారన్న కక్షతో వారిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సుబ్బరాము అతని కుమారుడు ప్రసాద్‌లు మహిళలపై వేటకొడవళ్లతో దాడి చేసి గాయపరిచారని బుధవారం పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమను ఎన్నో సార్లు కొట్టి గాయపరచడమే కాకుండా తమపైనే కేసులు బనాయించారని వారు వాపోయారు.

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

చక్రాయపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం గండిక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం కావడంతో భక్తులు గండికి విరి విగా వచ్చారు. ముఖ్యంగా చిత్తూరు జిల్లాకు చెందిన గుర్రంకొండ, తంబళ్లపల్లె, చిత్తూరు, చెర్లోపల్లె గ్రామాలకు చెందిన భక్తులు ఆంజనేయస్వామి మాల ధరించి పాదయాత్రగా గండికి చేరుకున్నారు. అలాగే రాయలసీమ జిల్లాల నుంచి కూడా భక్తులు భారీగా గండికి చేరుకున్నారు. ఉదయం 10గంటల వరకు అంతగా కనిపించని భక్తులు ఆ తర్వాత తాకిడి ఎక్కువైంది. సాయంత్రం 4గంటల వరకు భక్తుల రద్దీ కనిపించింది. వచ్చిన భక్తుల కోసం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకుడు, మాజీ చైర్మన్ వెంకటస్వామి ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌లు ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణగావించి భక్తులకు తీర్థప్రసాదాలు నొసంగారు. కాగా, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు దాదాపు 50 మందితో పాటు పలువురు మహిళలు స్వామి వారికి సేవ చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, దర్శనం చేసుకుంటున్న మహిళా భక్తులు

అన్నదానానికి విరాళాలు: గండి క్షేత్రంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతల ద్వారా, కౌంటర్ల ద్వారా విరాళాలు విరివిగా వచ్చాయి. నీల కంఠారెడ్డి జ్ఞాపకార్థం రాచమల్లు లక్ష్మీదేవమ్మ, అల్లుడు పి.వెంకటరామిరెడ్డి, భార్య అఖిల రూ.100116 విరాళంగా ఇచ్చారు. మొత్తంగా రూ.1,95,565 విరాళాలు వచ్చాయి. తాత్కాలిక హుండీ ద్వారా రూ.15367 వచ్చింది. మొత్తంగా రూ.5,81,172 ఆదాయం వచ్చింది.

కమనీయం వృషభాచలేశ్వరుడి కల్యాణం



వేంపల్లె, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం పురస్కరించుకొని స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన వృషభాచలేశ్వరుడి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. మాజీ సర్పంచు రామలింగయ్య కుమారుడు శరత్ బాబు దంపతుల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం జరిగింది. వృషభాచలేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీను, ఆర్.వేణు ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. కల్యాణోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లో పదోన్నతులు, బదిలీలు

కలికిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించారు. ఈమేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వారికి హెచ్‌ఓడీలుగా, సీని యర్ హెచ్‌ఓడీలకు ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్లు ఇచ్చారు. పదోన్నతులు పొందిన వారిని ఇతర కళాశాలల్లో నియమించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనరల్ సెక్షన్ హెచ్‌ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ డీఆర్ఎస్ గంగస్వామికి పదోన్నతి కల్పించి వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అలాగే శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న యు.రవీంద్రనాథ్‌ను మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీగా నియమించారు. కలికిరి పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.అమరనాథను తిరుపతి జిల్లా పుత్తూరు నియోజకవర్గంలోని పిల్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీగా నియమించారు. ఈమేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణశాఖ కార్యదర్శి కోన శశిధర్ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెండ్లిమర్రి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ పగడాలపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల నరేంద్ర (35) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. ద్విచక్ర వాహనంలో వస్తూ వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న క్యాంపర్ వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని స్వగ్రామం నందిమండలం వాసి అని తెలుస్తోంది. కడపకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు.

ఆటో ఢీకొని విద్యార్థినికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని నవ్య

ములకలచెరువు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో ఇంటర్ విద్యార్థిని తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దుగుసానిపల్లెకు చెందిన రైతు నాగరాజు కుమార్తె నవ్య (17) ఇంటర్మీడియట్ చదువుతోంది. ఈ క్రమంలో ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ద్విచక్రవాహనంలో నవ్య సోంపాళ్యంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్లింది. అక్కడ దర్శనం అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద ఆటో వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎస్పీకి ఎంఆర్‌పీఎస్ నేతల శుభాకాంక్షలు


అదనపు ఎస్పీ వెంకటాద్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న రామాంజనేయులు

రాయచోటిటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు మాదిగ బుధవారం అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, బడుగు, బలహీన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలకు తావు లేకుండా చూడాలని కోరారు. అందుకు ఏఎస్పీ స్పందిస్తూ కులమతాలకు అతీతంగా కచ్చితంగా అందరినీ సరియైన మార్గంలో నడిపించడానికి చట్టపరంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సామాజిక కారయకర్త రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప డీఎస్పీకి శుభాకాంక్షలు


కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

సిద్దవటం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడపాయపల్లెకు చెందిన ప్రజాప్రతినిదులు శివరామిరెడ్డి, నాగరాజు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఉండి పండుగలు జరుపుకోవాలని ఆయన అన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలపై బుధవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు సమాచారం అందించడంతో రైల్వే పోలీసులు సంఘట నా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సా యంత్రం 6 గంటల సమయంలో ప్రమా దం జరిగి ఉంటుందని, మృతుడికి 30 ఏళ్ల వయసుంటుందని, బ్లూ జీన్స్, గ్రీన్ టీ షర్టు ధరించాడని వారు తెలిపారు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఆ యువకుడు ప్రమాద వశాత్తూ రైలు కింద పడ్డాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అన్న విషయం పోలీసులు తేల్చాల్సి ఉంది.

తప్పిన పెనుప్రమాదం

● ఘాట్ రోడ్డులో పనిచేయని బస్సు క్లచ్

బి.కొత్తకోట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఓ పెద్ద అపశ్రుతి తప్పింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. జనవరి ఫస్టుకు సందర్భంగా ద్విచక్ర వాహనాలను హార్సిలీహిల్స్ పైకి అనుమతించకపోవడంతో ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పర్యాటకులతో వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు ఘాట్‌రోడ్డులోని 4వ మలుపులో వెళుతుండగా క్లచ్ పనిచేయకుండా పోవడంతో బస్సు ముందుకు వెళ్లడానికి మొరాయించింది. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సు పిట్టగోడను ఢీకొనకుండా నిలువరించాడు. బస్సును అనుసరిస్తూ వెళుతున్న వాహనాల్లోని ప్రయాణికులు కిందకు దిగి చక్రాల కింద రాళ్లు వేసి ఆపగలిగారు. కాగా బస్సు రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్‌జామ్ అయింది. ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు, ప్రయాణికులు కలిసి బస్సును ఓవైపు పక్కకు తోశారు.

వైద్యమో.. రామచంద్రా..

● మధ్యాహ్నానికే ఆసుపత్రి మూత ● నిరాశతో వెనుదిరిగిన రోగులు


మధ్యాహ్నానికే మూతపడిన పీహెచ్‌సీ తలుపులు (ఇన్‌సర్ట్) నిరాశ వ్యక్తం చేస్తున్న వృద్ధులు

సిద్దవటం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో వైద్య కేంద్రం ఉన్నా, మధ్యాహ్నానికే మూత పడడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి చికిత్స కోసం వచ్చిన రోగులు వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పి.కొత్తపల్లెలోని ప్రభుత్వ వైద్యశాలలో ఒక మహిళా డాక్టరు, ఒక పురుష డాక్టరుతో సహా తొమ్మిది మంది సిబ్బంది ఉన్నారు. బుధవారం నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సిబ్బందిలోని ఇద్దరు వచ్చి ఆస్పత్రిలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన అనంతరం తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఈ విషయం తెలియక చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు ఆస్పత్రి వరకూ వచ్చి, తాళం వేసిన విషయం గుర్తించి నిరాశకు గురయ్యారు. అంత దూరం నుంచి వస్తే కనీసం మందు బిళ్లలు కూడా ఇచ్చే దిక్కు లేకుండా పోయిందని వారు వాపోయారు. కీళ్లు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న తాము కాళ్లీడ్చుకుంటూ వచ్చి, వట్టి చేతులతో వెళ్లాల్సి వస్తోందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతోనే ఈ ఆస్పత్రికి వస్తున్నామని వారు తమ దీన పరిస్థితిని విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది పని వేళలు పాటించేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వైద్యశాల మూసివేతపై జిల్లా వైద్యాధికారి నాగరాజును వివరణ కోరగా కలెక్టర్ మీటింగ్‌లో ఉన్నాను, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

● కిటకిటలాడిన నాయకుల కార్యాలయాలు


రాష్ట్ర మంత్రి రాం ప్రసాద్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


సుగవాసి ప్రసాద్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు సోమవారం అర్ధరాత్రి నుంచే జరుపుకున్నారు. యువకులు రోడ్లపైకి వచ్చి టపాకాయలు కాల్చి, కేకులు కట్‌చేసి, స్వీట్లు పంచిపెడుతూ.. సంబరాలు చేసుకున్నారు. ప్రజలు దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో.. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల కార్యాలయాల్లో కార్యకర్తలు, నాయకుల హడావుడి ఎక్కువగా కనిపించింది. అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల కార్యాలయాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై.. తమ అభిమాన నాయకుడికి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఆ నాయకుల కార్యాలయాల్లో. కేకులు కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు స్థానికంగా ఉన్న తమ ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ మృతి సందర్భంగా సంతాప దినాలు పాటిస్తుండడంతో జిల్లా కలెక్టర్, ఎస్పిలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోలేదు. మదన పల్లె పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మంగళ వారం రాత్రి యువత కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యంగా బెంగుళూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, నీరుగట్టువారిపలె ప్రాంతాలలో కేక్‌కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. ఆయా కాలనీలు, నివాస ప్రాంతాలలో మహిళలు ముత్యాల ముగ్గులు వేసి పిల్లాపాపలతో సంబరాలు చేసుకున్నారు. బుధవారం ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్‌స్థాయి, మండల స్థాయి అధికారులను సహచర ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలతో అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టీడీపీ నేతలు రాటకొండ బాబురెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత గంగారపు రాందాస్‌చౌదరి తదితరులను కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తంబళ్ళపల్లె నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోపూరు మల్లికార్జున నాయుడు కలిసి సంబరాలు చేసుకున్నారు. మదనపల్లె పట్టణంలోని వెంకటరమణ స్వామి ఆలయం, మడికయ్యల శివాలయం , సీఎస్ ఐ చర్చిలను విద్యుత్ దీపా లతో అలంకరించారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో ఉదయం ప్రార్థనలు చేశారు. తంబళ్ళపల్లె మల్లయ్య కొండలో భక్తుల రద్దీ పెరిగింది. .బికొత్తకోటలోని హార్సిలీ హిల్స్ లో పర్యాటకుల సందడి కనిపించింది. రాజంపేటలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్ రాజు కార్యాలయాలలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి నియోజకవర్గంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా నాయకుల కార్యాలయాల వద్ద అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున శుభాకాంక్ష లు తెలియజేశారు. ఎస్ఎన్‌కాలనీలోని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాం ప్రసాద్‌రెడ్డి కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో టీడీపీ నాయ కులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనను కలిసి శుభాకాం క్షలు తెలిపారు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని శాఖ లకు చెందిన అధికారులను రాష్ట్ర మంత్రిని కలి సి పూలమాలలు, బొకేలతో సత్కరించారు. మంత్రితో పాటు ఆయన భార్య హరిత, కు మారుడు నిశ్చల్, సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తదితరులకు కూడా నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణం లోని గాలివీడు రోడ్డులో మాజీ ఎంపీ సుగవాసి పాల కొండ్రాయుడు, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబులను పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు కలిసి పూలమాలలతో సత్కరిం చారు. నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డిని నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కలిసి పూలమాలల తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

● అధికారులకు మంత్రి మండిపల్లి పిలుపు

రాయచోటిటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు మంత్రికి పూలబొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా నూతన సంవత్సరంలో జిల్లాను సమష్టిగా, నూతనోత్తేజంతో పనిచేద్దామని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాపతినిదులు, ప్రజలు మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సాదాసీదాగా నూతన సంవత్సర సంబరాలు


రైల్వేకోడూరు: అభిమానులకు కేక్ తినిపిస్తున్న కస్తూరి విశ్వనాథ నాయుడు


కేకే చౌదరి కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిద్దవటం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి దేశవ్యాప్తంగా సంతాప దినాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు సాదా సీదాగా జరిగాయి. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత మాట్లాడుతూ గడిచిన యేడాది జ్ఞాపకాలు మరచిపోయి కొత్త సంవత్సరంలో అంకిత భావంతో ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా పనిచేయాలని తెలియజేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రాష్ట్ర టీడీపీ కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు కేక్ కత్తిరించి అభిమానులకు పంచి పెట్టారు. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమ చైర్మన్ కేకే చౌదరి రైల్వేకోడూరు కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పలు ఆయాల్లో ప్రత్యేక పూజ లు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పఠాన్ మౌలా, మలిశెట్టి మురళీ ధర్ గౌడ్, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, రాజ, కస్తూరి చంద్రశేఖర్, రామచంద్రయ్య, బాలిశెట్టి హరి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : సిద్దవరం సింగారెడ్డిపల్లె, ఈటమాపురం, ఓబలి, కట్టవారిపల్లె, పేరంవారిపల్లె తదితర గ్రామాల నాయకులు ముక్కావారిపల్లెలోని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి ఇళ్లకు వెళ్లి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఓబులవారిపల్లెల్లో మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెన్నరాయుడు ఆధ్వర్యంలోగ్రామ దేవతలకు పూజలు, చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. లక్కిరెడ్డిపల్లెలో యనమల మదన్ మోహన్ ఆధ్వర్యంలో, వీరబల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్, కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు.

ఆకేపాటి, మేడా కార్యాలయాల్లో ...


మేడా విజయశేఖర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న టీడీపీ కార్యకర్తలు

రాజంపేట టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, తదితర వైసీపీ నేతలు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డిని కలిసి పూలమాల వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి(బాబు) కార్యా లయంలో పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్‌చేసి పూలమాలలు, శాలువాలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

పెనగలూరు: మండల పరిధిలోని కొండూరులోమాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డిలకు మండల నలుమూలల నుంచి వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కోదండ రామాలయానికి పోటెత్తిన భక్తులు


కోదండరాముడి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

ఒంటిమిట్ట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో వృద్ధులు, పిల్లలు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనం కోసం బారులుతీరారు. కోదండ రామాలయం చుట్టూ పెద్దఎత్తున కార్లు, స్కూటర్లతో ప్రాంగణమంతా వాహనాలతో నిండిపోయింది.

సెలవుల్లో స్టడీ అవర్స్‌ను రద్దు చేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌టీయూ మైనార్టీ కన్వీనర్

రామాపురం, జనవరి1 (ఆంధ్రజ్యోతి): వంద రోజు ల ప్రణాళిక పేరిట పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు స్టడీ అవర్స్ నిర్వహించడం సబబు కాదని పీఎస్టీయూ సంఘం రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ మజహరుల్‌హక్, సి బాగతుల్లా, లియాఖత్ అలీ బుధవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ స్టడీ అవర్స్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డీఈవోను కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వారంలో ఒకరోజు విశ్రాంతి ఉండాలని లేకపోతే ఒత్తిడి ఏర్పడి ఫలితాలపై ప్రభావం పడుతుందని వెల్లడించారు.

ఎస్‌ఏఎల్‌సీ చర్చి కార్యవర్గం ఎన్నిక


నూతన పాలకమండలి సభ్యులు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి1(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న ఎస్‌ఏఎల్‌సీ చర్చి నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పాస్టర్ ఇమ్మానియేల్ బాబు అధ్యక్షతన ఈ కమిటీ మూడేళ్ల పాటు బాధ్యతలు నిర్వహిస్తుందని నూతన అధ్యక్షుడు పాలెం భాను తెలిపారు. ఉపాధ్యక్షుడుగా చౌడవరం భాస్కర్, కార్యదర్శిగా ప్రకాశ్, కోశాధికారిగా ప్రభాకర్, కమిటీ సభ్యులుగా తిప్పన సాల్మన్, మిల్టన్, సుధాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుమాట్లాడుతూ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అందరికి నూతన సంవత్సరాల శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో ఓబులేసుని కొండపై వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి కళ్యాణోత్సవం నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొని, పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నదానం చేశారు.

రెవెన్యూ కార్యాలయంలో మొక్కలు నాటిన సిబ్బంది


రెవెన్యూ కార్యాలయంలో మామిడి మొక్క నాటుతున్న కార్యాలయ సిబ్బంది

పెనగలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : 2025 నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని పెనగలూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి అధ్యక్షతన సిబ్బంది పండ్ల మొక్కలు నాటారు. టీడీ జ్యోతి, ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్ సుబ్రమణ్యం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కోడూరులో పకడ్బందీగా గస్తీ

రైల్వేకోడూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర సంబరాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందరరావు, ఎస్ఐ. నవీన్‌బాబు తమ సిబ్బంది తో మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించారు. వైఎస్ , ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు, శ్రీకృష్ణదేవరాయులు సర్కిళ్ల వద్ద పోలీసులు గస్తీ చేశారు. అన్ని పార్టీలకు చెందిన కార్యాలయాల వద్ద పరిశీలించారు.

కార్యకర్తలకు సముచిత న్యాయం: సుగవాసి

సిద్దవటం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పార్టీకోసం కష్టపడిన కార్యకర్తలకు సముచిత న్యాయం జరుగుతుందని నూతన సంవత్సర వేడుకల్లో కార్యకర్తలకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హామీ ఇచ్చారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండల తెలుగుదేశంపార్టీ నేతలు రాయచోటి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయనను సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరికి న్యాయం జరుగుతుందని, కొత్త సంవత్సరం జనవరిలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో సిద్దవటం మండలానికి సముచిత న్యాయం జరుగుతుందని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరిని అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, నాయకులు కాడె చెంచయ్యనాయుడు, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు, పార్లమెంట్ బీసీసెల్ ఉపాధ్యక్షులు రాజశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు ఊరేగింపు


ఎద్దును ఊరేగిస్తున్న గ్రామస్తులు

నందలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ నీలిపల్లెకు చెందిన ఉప్పుశెట్టి ప్రసాద్‌కు చెందిన ఎద్దు 2 లక్షల రూపాయలకు అమ్ముడు పోవడంతో ఆ ఎద్దును బుధవారం బ్యాండ్ మేళాలు, టపాసులు పేల్చుతూ ఊరేగించి గౌరవించారు. అట్లూరు మండలం కోన రాచపల్లెకు చెందిన సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పుశెట్టి సుధీర్, హరికృష్ణ, పవన్, రామ్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

ముంపు పంచాయతీల పునర్విభజన ఎప్పుడో...

- పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలను బాయ్‌కాట్ చేసిన దత్తాపురం వాసులు
- అయినా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

కొండాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన పంచాయతీల పునర్విభజన కాకపోవడంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. గండికోట ప్రాజెక్టు కింద 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాలకు కొండాపురం మండలంతో పాటు ఇతర మండలాల్లోనూ పునరావాసం కల్పించారు. పునరావాసం కింద కొన్ని పంచాయతీలను యధాతదంగా ఉంచారు. అయితే మరికొన్ని పంచాయతీలను ముంపునకు గురికాని పంచాయతీల్లో కలిపారు. పునరావస కేంద్రం ఉన్న రెవెన్యూ భూమిలో పంచాయతీలను కలపారు. అయితే ముంపునకు గురికాక ముందు ఉన్న పంచాయతీలను యధాతదంగా ఉంచాలని ఆయా పంచాయతీల నిర్వాసితులు కోరుతున్నారు.

గ్రామసభలు నిర్వహించినా...

పంచాయతీలను వీలీనం చేసేటప్పుడు ప్రజల అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉంటుంది. అభిప్రాయాలను తీసుకున్నా అందుకు విరుద్ధంగా తమ పంచాయతీలను వీలీనం చేశారంటూ ముంపు వాసులు మండిపడుతున్నారు. గతంలో మండలంలోనే పెద్ద పంచాయతీగా ఉన్న దత్తాపురం పంచాయతీని, అలాగే బుక్కపట్నం, బొమ్మేపల్లె పంచాయతీలను కె.సుగుమంచిపల్లె పంచాయతీలో కలిపారు. అలాగే చౌటిపల్లె పంచాయతీని ఓబన్నపేట పంచాయతీలో కలిపారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో దత్తాపురం వాసులు పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరించారు. తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పంచాయతీలను వీలీనం చేయడంపై వారు మండిపడుతున్నారు.

దత్తాపురం గ్రామ ప్రజలు ఉంటున్న కె.సుగుమంచిపల్లె పంచాయతీ



పాత పంచాయతీలను కొనసాగించాలి

గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురికాక ముందు మండలంలో 28 పంచాయతీలు ఉండేవి. ప్రస్తుతం వీలినం చేయడంతో 24 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. 28 పంచాయతీల్లోని నాలుగు పంచాయతీలు చౌటిపల్లె, దత్తాపురం, బుక్కపట్నం, కె.బొమ్మేపల్లెలు వీలీనం కావడంతో ప్రస్తుతం 24 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. దీంతో పంచాయతీలకు వచ్చే నిధులను కోల్పోవడంతో పాటు, ఏళ్ల కాలం నుంచి తమ పంచాయతీలతో ఉన్న సెంటిమెంటును కోల్పోతున్నామని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

ఈ మధ్యన మంత్రి నిమ్మలరామానాయుడు గండికోట ప్రాజెక్టుకు వచ్చినప్పుడు ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. దీంతో కూటమి ప్రభుత్వంపైనే ముంపువాసులు ఆశలు పెట్టుకున్నారు.



గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలి

పంచాయతీల పునర్విభజనకు సంబంధించి నిర్వాసితులు కోర్టులో కేసు వేయగా ప్రభుత్వంతో పరిష్కరించుకోవాలని కోర్టు తెలిపింది. ప్రభుత్వంలో ఉన్న పెద్దలతో పాటు కలెక్టరు, ఇతర అధికారులతో కలిసి గ్రామసభల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది.

-నాగప్రసాద్, ఎంపీడీవో, కొండాపురం



మా పంచాయతీలను గతంలో మాదిరిగానే ఉంచాలి

గండికోట ప్రాజెక్టు కింద భూములు, ఇళ్లు కోల్పోయాం. ముంపున కు గురైన మా పంచాయతీకి సంబంధించిన ప్రజలు పునరావాసం కింద కె.సుగుమంచిపల్లె రెవెన్యూ భూమిలో ఇళ్లు నిర్మించుకుంటే ఆ పంచాయతీలో కలిపారు. మా ఊరు-మాది అనే భావన ఉంటుంది కదా. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మా పంచాయతీని పునర్విభజన చేసి గతంలో లాగానే ఉంచాలి.

-మేకల బాలనాగిరెడ్డి, దత్తాపురం

మహిళలపై వైసీపీ నేతల దాడి

- పోలీసులకు ఫిర్యాదు



గాయపడిన మహిళలు రమీజాబీ, రహీమాబీ

పెద్దతిప్పసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఇద్దరు మహిళలపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మహిళల సమాచారం మేరకు... మండలంలోని కందుకూరు గ్రామంలోని గుగ్గిళ్ల వీధికి చెందిన రమీజాబీ, రహీమాబీ అనే ఇద్దరు మహిళలు టీడీపీకి సానుభూతిపరులుగా ఉన్నారన్న కక్షతో వారిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సుబ్బరాము అతని కుమారుడు ప్రసాద్‌లు మహిళలపై వేటకొడవళ్లతో దాడి చేసి గాయపరిచారని బుధవారం పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమను ఎన్నో సార్లు కొట్టి గాయపరచడమే కాకుండా తమపైనే కేసులు బనాయించారని వారు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెండ్లిమర్రి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ పగడాలపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల నరేంద్ర (35) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. ద్విచక్ర వాహనంలో వస్తూ వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న క్యాంపర్ వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని స్వగ్రాహం నందిమండలం వాసి అని తెలుస్తోంది. కడపకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు.

ఆటో ఢీకొని విద్యార్థినికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని నవ్య

ములకలచెరువు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో ఇంటర్ విద్యార్థిని తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దుగుసానిపల్లెకు చెందిన రైతు నాగరాజు కుమార్తె నవ్య (17) ఇంటర్మీడియట్ చదువుతోంది. ఈ క్రమంలో ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ద్విచక్రవాహనంలో నవ్య సోంపాళ్యంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్లింది. అక్కడ దర్శనం అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద ఆటో వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రూయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

చక్రాయపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం గండిక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం కావడంతో భక్తులు గండికి విరివిగా వచ్చారు. ముఖ్యంగా చిత్తూరు జిల్లాకు చెందిన గుర్రంకొండ, తంబళ్లపల్లె, చిత్తూరు, చెర్లోపల్లె గ్రామాలకు చెందిన భక్తులు ఆంజనేయస్వామి మాల ధరించి పాదయాత్రగా గండికి చేరుకున్నారు. అలాగే రాయలసీమ జిల్లాల నుంచి కూడా భక్తులు భారీగా గండికి చేరుకున్నారు. ఉదయం 10గంటల వరకు అంతగా కనిపించని భక్తులు ఆ తర్వాత తాకిడి ఎక్కువైంది. సాయంత్రం 4గంటల వరకు భక్తుల రద్దీ కనిపించింది. వచ్చిన భక్తుల కోసం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకుడు, మాజీ చైర్మన్ వెంకటస్వామి ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌లు ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణగావించి భక్తులకు తీర్థప్రసాదాలు నొసంగారు. కాగా, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు దాదాపు 50 మందితో పాటు పలువురు మహిళలు స్వామి వారికి సేవ చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, దర్శనం చేసుకుంటున్న మహిళా భక్తులు

అన్నదానానికి విరాళాలు: గండి క్షేత్రంలో జరిగే నిత్యన్నదాన పథకానికి దాతల ద్వారా, కౌంటర్ల ద్వారా విరాళాలు విరివిగా వచ్చాయి. నీల కంఠారెడ్డి జ్ఞాపకార్థం రాచమల్లు లక్ష్మిదేవమ్మ, అల్లుడు పి.వెంకటరామిరెడ్డి, భార్య అఖిల రూ.100116 విరాళంగా ఇచ్చారు. మొత్తంగా రూ.1,95,565 విరాళాలు వచ్చాయి. తాత్కాలిక హుండీ ద్వారా రూ.15367 వచ్చింది. మొత్తంగా రూ.5,81,172 ఆదాయం వచ్చింది.

కమనీయం వృషభాచలేశ్వరుడి కల్యాణం



వేంపల్లె, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం పురస్కరించుకొని స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన వృషభాచలేశ్వరుడి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. మాజీ సర్పంచు రామలింగయ్య కుమారుడు శరత్ బాబు దంపతుల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం జరిగింది. వృషభాచలేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీను, ఆర్.వేణు ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. కల్యాణోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

కోదండ రామాలయానికి పోటెత్తిన భక్తులు



ఒంటిమిట్ట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో వృద్ధులు, పిల్లలు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. కోదండ రామాలయం చుట్టూ పెద్దఎత్తున కార్లు, స్కూటర్లతో ప్రాంగణమంతా వాహనాలతో నిండిపోయింది.

పాలిటెక్నిక్ కళాశాలల్లో పదోన్నతులు, బదిలీలు

కలికిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు సీనియారిటీ ప్రకారం పదోన్న తు లు కల్పించారు. ఈమేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వారికి హెచ్ఓడీలుగా, సీని యర్ హెచ్ఓడీలకు ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్లు ఇచ్చారు. పదోన్నతులు పొందిన వారిని ఇతర కళాశాలల్లో నియమించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనరల్ సెక్షన్ హెచ్ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ డీఆర్ఎస్ గంగస్వామికి పదోన్నతి కల్పించి వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అలాగే శ్రీకాకుళం జిల్లా ఆము దాలవలస పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న యు.రవీంద్ర నాథ్‌ను మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీగా నియమించారు. కలికిరి పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.అమరనాథను తిరుపతి జిల్లా పుత్తూరు నియోజకవర్గంలోని పిల్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రా నిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీగా నియమించారు. ఈమేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, స్కిల్ డెవ లప్‌మెంట్ శిక్షణశాఖ కార్యదర్శి కోన శశిధర్ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

ఈఈ హరిసేవ్యానాయక్

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ కడప ఈఈ హరిసేవ్యానాయక్ తెలిపారు. తొలివి డతగా కడప డివిజన్‌లో అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కడప డివిజన్‌లో ప్రయోగాత్మకంగా విద్యుత్ బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి ఇస్తామన్నారు. జనవరి నుంచే ఇది అమల వుతుందన్నారు. ఇంట్లోనే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ అప్లికేషన్ల ద్వారా బిల్లులు చెల్లించే అవకాశాన్ని సంస్థ కల్పిస్తుందన్నారు. కడప డివిజన్‌లో విజయవంతం అయితే జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఏకసభ్య కమిషన్ రాక

బద్వేలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయానికి సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఈనెల 3వ తేదీ కడపకు రానున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై పూర్తి స్థాయిలో ఉపకులాల నుంచి అభిప్రాయాల సేకరణలో భాగంగా ఈ కమిషన్ కడపకు రానుందన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ సంఘాలు,ఉపకులాల సభ్యులు తమ అభిప్రాయాలను వినతిపత్రాల రూపంలో అందజేయవచ్చన్నారు.



నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లెటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం నారమాకులతాండాలో నాటుసారా తయారీ చేసి, విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో నారమాకులతాండాలో తనిఖీలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన పి.రామానాయక్ కుమారుడు నరసింహులు నాయక్(61) వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు డోర్కాస్, జబీవుల్లా, హెచ్‌సీ అలి, పీసీ నాగరాజు, మధు, వెంకటేశ్ పాల్గొన్నారు.

11 మంది కోడిపందెంరాయుళ్లు అరెస్టు

గుర్రంకొండ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కోడి పందేలపై పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ బోడ్డిగుట్టకు సమీపంలోని పొలాల్లో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.20,610తో పాటు ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకునట్లు ఎస్ఐ తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించండి

మదనపల్లెటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గృహ, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు ఇకమీదట విద్యుత్ బిల్లుపై వచ్చే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా చెల్లించడం సులువుగా వుండటంతో పాటు, వినియోగదారుడికి ఎలాంటి అదనపు చార్జీలు వుండవని ఈఈ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు భూమి పూజ

మదనపల్లె, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె హిందూశ్మశాన వాటికలో గురువారం జరిగే అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు తెలిపారు. నిమ్మనపల్లె సర్కిల్‌లోని సంఘం కార్యాలయంలో నారాలోకేష్ యూత్ ప్రెసిడెంట్ కంచెర్ల చింటూతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ మదనపల్లెలో హిందూశ్మశాన వాటిక లేకపోవడంతో పుష్కర కాలంగా పోరాటం చేసినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా చేపట్టే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

మదనపల్లె, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్ హాలులో గురువారం ఉదయం 9గంటలకు జరిగే దివ్యాంగుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.

నేడు మండల మీట్

ములకలచెరువు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో హరినారాయణ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగులతో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, నగిరిపల్లెలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న తహసీల్దార్ ఖాజాబీ, సిబ్బంది, ములకలచెరువులో టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

- యువత కేరింతలు.. పలుచోట్ల కేకు కటింగ్‌లు
- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్ద కిక్కిరిసిన టీడీపీ శ్రేణులు

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల కేకు కటింగ్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఇక రాజకీయ నేతలు ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాలు, చర్చీల్లో భక్తులు కిటకిటలాడారు.

కలికిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం నగరిపల్లె జన జాతరతో కిక్కిరిసింది. ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వచ్చిన టీడీపీ శ్రేణులు బారులు తీరారు. మరో వైపు అధికారులు, ఉద్యోగులు కూడా భారీ సంఖ్యలో జత కలిశారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలు విడివిడిగా కేకులు తీసుకొచ్చి కిశోర్‌కుమార్‌రెడ్డితో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేవీపల్లె మండలం నుంచి తెచ్చిన 200 కిలోల భారీ కేకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజారెడ్డితో పార్టీ నాయకుల సమక్షంలో కేకు కట్ చేశారు. లెక్కకు మించి వాహనాలు రావడంతో నగరిపల్లెకు వెళ్లే దార్లు మూసుకుపోయాయి. వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె, పీలేరు, కలికిరి మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వస్తూనే ఉన్నారు.

కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసిన జగన్‌మోహనరాజు

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహనరాజు పీలేరు ఎమ్మెల్యేను కలిశారు. నగరిపల్లెలోని ఆయన స్వగృహం వద్ద కిశోర్‌కుమార్‌రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురూ కొద్దిసేపు పార్టీ కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. పలువురు మండల టీడీపీ అధ్యక్షులు కూడా జగన్మోహనరాజును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పీలేరు: ఆంగ్ల సంవత్సరానికి పీలేరు మండల ప్రజలు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. ఏడాది తొలి రోజున దైవదర్శనం చేసుకుంటే ఏడాదంతా శుభం కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఆలయాలకు పోటెత్తారు. దీంతో పీలేరులోని కాశీవిశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి, తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చర్చీలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం జరిగాయి. పీలేరు మండలంలోని కూటమి పార్టీల శ్రేణులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు కలికిరి మండలం నగరిపల్లెకు తరలివెళ్లారు. బేకరీలు, హోటళ్లు, డాబాలు ప్రజలతో కిటకిటలాడాయి.

మదనపల్లెఅర్బన్: మదనపల్లెలో బుధవారం ఘనంగా న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లెలోని సీఎస్ఐ చర్చిలో ఈ నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన అనుచరులతో పాల్గొన్నారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండమ్ సునీల్ వరకుమార్ క్రైస్తవుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో మంజునాధున్ని ప్రత్యేకంగా అలంకరణలు చేసి భక్తులకు దర్శనం ఆలయకమిటీ సభ్యులు కల్పించారు.

మదనపల్లెటౌన్: బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను డివిజన్‌లోని రెవెన్యూ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి స్వీట్లు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సబ్‌కల్టెర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరూ సుఖ, సంతోషాలు, ఆరోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎం బాబ్జి, అన్ని మండలాల తహసీల్దార్‌లు, పశువైద్యుడు డాక్టర్ లారెన్స్ పాల్గొన్నారు.

మదనపల్లెను అభివృద్ధి పథంలో నడిపించాలి

ప్రభుత్వ అధికారులు మదనపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలు, అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వున్న తెలుగు యువత నాయకులు శ్రీరామ్‌చినబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లె: ఆంగ్ల కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా పార్టీల నేతలకు నూతన సంత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో బసినికొండ పంచాయతీ గంగన్నగారిపల్లెకు చెందిన గంగారపు బాబురెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కత్తి లక్ష్మన్న, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చుక్కా విజయ్‌కుమార్, బసినికొండ గ్రామ కమిటీ నటశేఖర్, పి.నాగేంద్ర, నాదెళ్ల రామచంద్రనాయుడు, బాలప్పగారి రమేష్, దేవుడు రమేష్, గంగమ్మగుడి నారాయణస్వామి, చిన్న నారాయణస్వామి, వెంకటరమణ, తదితరులు ఉన్నారు. అలాగే టమోటా మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఎస్.ఎ.మస్తాన్‌ను ఆయన నివాసంలో వర్కర్లు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీరంతా ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడుని ఆయన నివాసం రెడ్డీస్‌కాలనీలో, సొసైటీ కాలనీలోని టీడీపీ సీనియర్ నాయకుడు సుధాకర్‌నాయుడుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ములకలచెరువు: ప్రజలు, టీడీపీ శ్రేణులు కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ములకలచెరువులోని జయచంద్రారెడ్డి స్వగృహంలో బుధవారం నూతన సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురబలకోట: మండలంలో నూతన సంవత్సర సంబరాలు బుధవారం అంబరాన్నంటాయి. అలాగే రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పలువురు నాయకులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ ద్వారకనాథ్, ప్రిన్సిపల్ యువరాజ్ కేక్ కట్ చేశారు.



టీడీపీ నేత గంగారపు బాబురెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న కత్తి లక్ష్మన్న, విజయ్, నటశేఖర్, తదితరులు

వాల్మీకిపురం ఈఆర్‌వో కార్యాలయం కలికిరికి తరలింపు

వాల్మీకిపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని కలికిరికి తరలిస్తూ డిసెంబరు 31న తిరుపతి సీఎండీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం 1996లో అప్పటి పూర్వపు నియోజకవర్గ కేంద్రమైన వాల్మీకిపురంలో ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ రంగనాథం ప్రారంభించారు. అప్పటి నుంచి వాల్మీకిపురం, కలికిరి, కలకడ, గుర్రంకొండ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులకు ఎంతో సౌలభ్యంగా వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించుకునే వారు. దశాబ్దం కాలం క్రితం వాల్మీకిపురం కార్యాలయాన్ని కలికిరికి తరలిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి కలికిరి, కలకడ మండలాలకు కలిపి కలికిరిలో రెవెన్యూ విద్యుత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలకు కలిపి వాల్మీకిపురంలోనే ఏర్పాటు చేశారు. అయితే తాజాగా తిరుపతి సీఎండీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేయడంతో కొత్త ఏడాదిలో ఈ విద్యుత్ కార్యాలయం కలికిరికి తరలిపోయింది. దీంతో స్థానికులతో పాటు గుర్రంకొండ మండలానికి చెందిన ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కొక్కటిగా ప్రభుత్వ కార్యాలయాలన్నీ పీలేరు, కలికిరికి తరలివెళ్లిపోయాయని, తాజాగా విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఉన్న ఈ ఒక్క కార్యాలయం కూడా కలికిరికి వెళ్లిపోవడంతో వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ అధికారులు చొరవ చూపి ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయం కలికిరికి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని గుర్రంకొండ, వాల్మీకిపురం ప్రజలు కోరుతున్నారు.



వాల్మీకిపురం ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం

మదనపల్లె అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ సందర్భంగా వెల్‌విషర్స్ అండ్ ఫ్రెండ్స్ సపోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు అన్నారు. ఇందులో 52 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెల్‌విషర్స్ సంస్థ రక్తదానం, అన్నదానం సామాజిక సేవ చేస్తుండడం సంతోషించదగ్గ విషయమన్నారు. యువతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు డాక్టర్ భార్గవ్, సిబ్బంది వెల్‌విషర్స్ సభ్యులు గిరీష్, అరుణ్, శ్రేయస్, భానుప్రకాష్, రెడ్డిశేషురెడ్డి, లక్ష్మీపతి, ఇళయరాజా, రామాంజులరెడ్డి, విజయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సంస్థ సభ్యులు

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

- బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

వాల్మీకిపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. 2025 నూతన సంవత్సరం సందర్భంగా పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి క్రీడాకారులకు బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించి ప్రోత్సహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి క్రీడాకారులను అభినందించి, నూతన సంవత్సర కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సెక్రటరీ రవిచంద్ర, ఎంఈవో సుబ్రహ్మణ్యం, సీనియర్ క్రీడాకారులు, విశ్వనాథరెడ్డి, సాయిభార్గవ్, కిరణ్, అంజి, చిన్ను, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా అసోసియేషన్ నేతలు

తప్పిన పెనుప్రమాదం

- హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో పనిచేయని బస్సు క్లచ్

బి.కొత్తకోట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నూతన సంవత్సర వేడుకల్లో ఓ పెద్ద అపశ్రుతి తప్పింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. జనవరి ఫస్ట్‌కు పర్యాటకులు వేలాదిగా తరలిరానుండటం, ద్విచక్ర వాహనాలను కొండపైకి అనుమతించక పోవడంతో ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. మదనపల్లె- హార్సిలీహిల్స్, బి.కొత్తకోట-హార్సిలీహిల్స్‌తో పాటు దిగువ నుంచి కూడా బస్సులను నడిపింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పర్యాటకులను నింపుకొని వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు ఘాట్‌రోడ్డులోని 4వ మలుపులో వెళుతుండగా క్లచ్ పనిచేయకుండా పోవడంతో బస్సు ముందుకు వెళ్లడానికి మొరాయించింది. దీంతో భయభ్రాంతులకు గురై ప్రయాణికులు హాహాకారాలు చేశారు. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సు పిట్టగోడను ఢీకొనకుండా నిలువరించాడు. బస్సును అనుసరిస్తూ వెళుతున్న వాహనాల్లోని ప్రయాణికులు కిందకు దిగి చక్రాల కింద రాళ్లు వేసి ఆపగలిగారు. కాగా బస్సు రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్‌జామ్ అయింది. ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు, ప్రయాణికులు కలిసి బస్సును ఓవైపు పక్కకు తోశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో మొరాయించిన ఆర్టీసీ బస్సు

మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసి ద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ నూతన సంవత్సర శోభను సంతరించుకుంది. బుధవారం తెల్లవారుజా ము నుంచే పెద్దలు, యువకులు, పిల్లలు ఉత్సాహంగా మల్లయ్యకొండకు తరలివచ్చారు. జిల్లా నుంచే కాకుండా రాయలసీమ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో కొండ పరిసరాలు, మల్లికార్జునస్వామి ఆలయం, గౌరమ్మ ఆల యం, నిచ్చెన గుండం, వీరన్న గెవి, ఏనుగు మల్లమ్మ ఆలయం తదితర ప్రాంతాలు జనసందోహంతో మహాశివరాత్రిని తలపించింది. అర్చకులు ఈశ్వరప్ప స్వామి వారిని నాగాభరణంతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. పలువురు యువకులు, చిన్నారులు కొండ కింద నుంచి భక్తిశ్రద్ధలతో సుమారు 8 కి.మీ. ఉన్న ఘాట్ రోడ్డు వెంబడి కాలినడకన మల్లయ్యకొండ ఎక్కి స్వామివారిని దర్శించున్నారు. కొండపైన ఆలయ ఈవో మునిరాజ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొండ పైకి ఆర్టీసీ బస్సులను నడిపారు.

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. అలాగే చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.

బి.కొత్తకోట: మండలంలోని బండెన్నస్వామి ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచే కాక సరిహద్దు కర్నాటక గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి బండెన్నస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త లక్ష్మీపతిస్వామి ఆలయంలో అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మల్లయ్యకొండ ఆలయం వద్ద భక్తుల రద్దీ

మా గోడు మీరైనా పట్టించుకోండి!

- కిశోర్‌కుమార్‌రెడ్డి ముందు వాపోయిన తంబళ్లపల్లె టీడీపీ శ్రేణులు

కలికిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో అందరికీ మంచి జరుగుతున్నా తంబళ్లపల్లెలో టీడీపీ కార్యకర్తలకు తీవ్రంగా అన్యాయం జరుగుతోందంటూ ఆ నియోజకవర్గం నుంచి వచ్చిన వందలాది నాయకులు కార్యకర్తలు పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి ముందు వాపోయారు. నూతన సంవత్సరం సందర్భంగా నగరిపల్లెలో స్వంత నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్తలతో ఆయన తలమునకలుగా వున్న సమయంలో తంబళ్లపల్లె నుంచి దాదాపు 300 మంది టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని తాము ఎదుర్కొంటున్న సమస్యలను వినాలని పట్టుబట్టారు. నియోజకవర్గంలో వైసీపీ వారికే అన్ని పనులు జరుగుతున్నాయని, టీడీపీ కోసం అహర్నిశలు కష్టపడిన తాము రోడ్ల మీదకు రావలసిన దుస్థితి నెలకొందని చెప్పుకొచ్చారు. వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్లూ అన్ని రకాల నష్టపోయామని, టీడీపీ అధికారంలోకి వచ్చిందని సంతోషపడాల్సింది పోయి తిరిగి వేధింపులకు గురికావలసి వస్తోందని ఏకరువు పెట్టారు. మీరైనా జోక్యం చేసుకుని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అరాచకాలకు ఎదురొడ్డి పోరాడి అలసిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. తాను కూడా తంబళ్లపల్లెలో పరిస్థితుల గురించి సీఎం చంద్రబాబుకు, లోకేష్‌కు వివరిస్తానని ఎవరూ బహిరంగ చర్చలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన నాయకులు చివరకు సర్దుమణిగారు. అప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలు తంబళ్లపల్లె వాసులు ఏకరువు పెడుతున్న సమస్యలను ఆసక్తిగా తిలకించారు.

అత్తపై అల్లుడు రాళ్లతో దాడి

నిమ్మనపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తెతో కాపురం చేయలేదని నిలదీసినందుకు అత్తపై అల్లుడు బండ రాళ్లతో దాడి చేసిన సంఘటన బుధవారం మండంలో చోటు చేసుకొంది. బాధితురాలు పర్వీన్‌బీ కథనం మేరకు... వెంగంవారిపల్లి పంచాయతీ సింగంవారిపల్లికి చెందిన షబ్బీర్‌కు తన కుమార్తె రషీదాను ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం చేసినట్లు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు వున్నారని, ఏడాదిన్నరగా కాలంగా తన కూమార్తెను వదిలేసి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని కేరళకు వెళ్లి పోయినట్లు ఆరోపించారు. కాగా బుధవారం కేరళ నుంచి సింగంవారిపల్లికు తన అల్లుడు షబ్బీర్ రావడంతో పర్వీన్‌బీ తన కుమార్తెను వదిలేసి తీవ్ర అన్యాయం చేశావని నిలదీసింది. దీంతో ఆగ్రహించిన షబ్బీర్ తన ఇంటి వద్ద వున్న బండరాళ్లతో దాడి చేయడంతో పర్వీన్‌బీకి గాయాలయ్యాయి. ఆమెను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



అల్లుడి దాడిలో గాయపడిన పర్వీన్‌బీ

బహుజనులు ఉద్యమించాలి

పీలేరు, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి): బీమా కోరేగావ్ యుద్ధాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి బహుజనులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పీలేరుకు చెందిన పలువురు ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. బీమా కోరేగావ్ 207వ శౌర్య దివస్‌ను వారు బుధవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన మహర్ రెజిమెంట్ సైనికులు, డా.బి.ఆర్.అంబేడ్కర్‌కు ప్రజాసంఘాల నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాసి వెంకటరామయ్య, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్, జెట్టి మల్లిఖార్జున, రవిచంద్ర, రెడ్డప్ప, యల్లప్ప, జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం నాయకులు రెడ్డయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పీలేరులో బీమా కోరేగావ్ స్మృతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు